క్లుప్తంగా

బకాయి వేతనాలు చెల్లించండి

భద్రాచలంఅర్బన్: గిరిజన సంక్షేమ శాఖ కళాశాల అనుబంధ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రావలసిన 18 నెలల వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఆదివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. పోస్టుమెట్రిక్ హాస్టల్స్ ఔట్‌సోర్సింగ్ వర్కర్లు, ఆశ్రమ పాఠశాలల ఐదు నెలల వేతన బకాయిల కోసం డైలీ వేజ్ వర్కర్లు వినతి పత్రాన్ని సమర్పించారు. 18 నెలలు వేతనాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారం చేయకపోతే ఫిబ్రవరి 27వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. భట్టి విక్రమార్క త్వరలోనే జీతాలు చెల్లిస్తామని స్పష్టం చేసినట్లు సీఐటీయూ నాయకులు వెల్లడించారు.సంఘం జిల్లా కోశాధికారి జి.పద్మ, హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జలంధర్, రామ, స్వరూప, తిరుపతమ్మ, జయ, లక్ష్మి, నూక శ్యామల, లాలయ్య, సారయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే నివాళి

భద్రాచలంఅర్బన్: సీపీఎం కార్యకర్త, ఐద్వా నాయకురాలు బందారు తులసి వర్ధంతి సభ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సభకు పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షత వహించగా.. తొలుత తులసి చిత్రపటానికి సీపీఎం రాష్ట్ర నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పార్టీని మరింత విస్తృతంగా బలోపేతం చేయటమే నిజమైన నివాళి అని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుకారం పుల్లయ్య, కె.బ్రహ్మాచారి, ఎంబీ నర్సారెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలకు కృషి

బూర్గంపాడు: రిటైర్డ్ ఉద్యోగులకు త్వరితగతిన బ్యాంకింగ్ సేవలను అందించేందుకు కృషి చేస్తామని బూర్గంపాడు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ప్రద్యుమ్న అన్నారు. ఆదివారం బూర్గంపాడులో తెలంగాణ రిటైర్డ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌బీఐ మేనేజర్ మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు కావాల్సిన లోన్స్, ఇతర బ్యాంకింగ్ సేవలను ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందిస్తామన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు కేసుపాక రాములు, వీరలింగయ్య, షబీరున్నీషా బేగం, అనసూయలను ఘనంగా సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు ఇజీఆర్ వెస్లీ, మహ్మద్ ఖాసీమ్, ఎంజె.విల్సన్, సువర్ణరత్నం, సీహెచ్ నాగేశ్వరరావు, తోకల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమయం ఇవ్వలేదు..

భద్రాచలంఅర్బన్: ఉమ్మడి ఐటీడీఏ కార్యాలయంలో ఆదివారం పాలక మండలి సమావేశానికి వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు లను కలిసి ఆదివాసీల సమస్యలు విన్నవించేందుకు వెళితే కనీసం పట్టించుకోలేదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య విమర్శించారు. మంత్రులు ఇలా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని ఆదివాసీలను రాష్ట్ర మంత్రులు ఇచ్చే మర్యాద ఇదేనా అని పుల్లయ్య ఐటీడీఏ కార్యాలయం ఎదుట వాపోయారు. నిత్యం ప్రజా సమస్యల పై పోరాడే ఆదివాసీల ప్రతినిధులకు మంత్రులు సమయం ఇవ్వకపోవడం విచారకరం అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కరకగూడెం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. అందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు పట్టణానికి చెందిన నవీన్ భూపాలపల్లి సింగరేణిలో విధులు నిర్వహిస్తున్నారు. అశ్వాపురంలో గల అత్తగారింటికి తన కుమారుడి బారసాలకు వెళ్లడానికి భూపాలపల్లి నుంచి మణుగూరు వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో భట్టుపల్లి వద్ద వెనకనుంచి కారు ఢీ కొట్టింది. దీంతో అతని కుడి చేతికి తీవ్ర గాయమవ్వగా కుడి వైపు పక్కటెముకలకు గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుని 108 వాహనంలో కరకగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లోమణుగూరు సింగరేణి ఆస్పత్రికి తరలించారు.

వివాహానికి హాజరైన ప్రజాప్రతినిధులు

దుమ్ముగూడెం: మండలంలోని గౌరారం గ్రామంలో జరిగిన బీఆర్ఎస్ నాయకుడు చంటి కూతురు వివాహానికి ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావులు ఆదివారం హజరయ్యారు.భద్రాచలం ఐటీడీఏ పాలక మండల సమావేశానికి వచ్చిన వారు వివాహ కార్యక్రమానికి హజరై వధువరూలను ఆశీర్వదించారు. వారి వెంట జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీపీ రేసు లక్ష్మి, మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో వ్యాపారుల చెలగాటం

- నాణ్యత లేని సరుకులు, నాసిరకం శీతల పానీయాల అమ్మకం
- అనారోగ్యం పాలవుతున్న ఏజెన్సీ వాసులు
- తనిఖీలు నిర్వహించని అధికారులు



ఓ దుకాణం వద్ద అమ్ముతున్న నిత్యావసర వస్తువులు

చర్ల: ఏజెన్సీలో వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. నాణ్యత లేని, నాశిరకం సరకులు అంటగడుతూ ప్రజలను అనారోగ్యం పాలుజేస్తూ ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. ప్రస్తుత హడావిడి సమాజంలో ప్రజలు తమ ఆరోగ్యాలపై దృష్టి పెట్టకుండా ఆ సమయానికి పనై పోయిందా లేదా అన్న భావనతో అన్నీ ఏజ్ గ్రూపుల వాళ్లు ముందుకెళ్తుండంతో నాణ్యత లేని సరకులను అంటగడుతున్న వ్యాపారుల హవా మూడుపువ్వులు ఆరు కాయలుగా ముందుకెళ్తోంది. ప్రజలు తింటున్న ఆహార పదార్థాలు, తాగుతున్న శీతల పానీయాలు నాణ్యత కలిగినవో కావో నిర్ధారించిన ప్రజారోగ్యశాఖాధికారులు కనీసం ఆ విక్రయాలపై కన్నెత్తి కూడా చూడడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

అమాయకులే ఆసరాగా..

అమాయకులనే ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు నాశిరకం, నాణ్యత లేని సరుకులను అంటగడుతున్నారు. మండలంలో ఎక్కువగా గిరిజన గ్రామాలే ఉండగా, అత్యధిక సంఖ్యలో నిరక్షరాస్యులే జీవనాన్ని సాగిస్తుంటారు. వీరికి అవసరమయ్యే నిత్యావసర వస్తువులు గ్రామాల్లో ఉండే చిన్న చిన్న కిరాణా దుకాణాల్లో కొనుగోలు చేస్తుంటారు. వారానికో సారి చర్లలో జరిగే వారపు సంతకు కూడా మండలంలోని వివిధ గ్రామాల ప్రజలతో పాటు సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని వివిధ గ్రామాల నుంచి ఆదివాసీలు వేలాదిగా తరలి వచ్చిబియ్యం, నూకలు, నిత్యావసర వస్తువులు, సరుకులు, తినుబండారాలు తదితరాలను కొనుగోలు చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో వ్యాపారులు వీరికి నాణ్యత లేని నాశిరకం సరుకులను అంటగడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వారపు సంతలోనే కల్తీ అధికం..

చర్లలో ప్రతీ ఆదిఆరం జరుగుతున్న వారపు సంతలో అమాయకులను ఆసరాగా చేసుకొని వ్యాపారులు నాణ్యత లేని నాశిరకం వస్తువులను అంటగడుతున్నారు. కారం, పసుపు, మసాలాలు, వంట నూనెలతో పాటు కిరాణా సామగ్రిని అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. గడవు తీరిన కూల్ డ్రింక్స్, తినుబండారాల వంటి వాటిని అమాయకులకు అంటగడుతున్నారు. జ్యూస్ పాయింట్లలో ద్వారా విక్రయిస్తున్న జ్యూస్‌లలోనూ అవసరం లేని పదార్థాలన్నీ కలుపుతూ ప్రజలను అనారోగ్యం పాలు జేస్తున్నారు. ఇక ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

తనిఖీల జాడేది..

చర్ల మండల కేంద్రంలో ప్రతీ వారం జరిగే వారపు సంతలో అమాయక ప్రజలకు నాణ్యత లేని, నాశిరకం వస్తువులను బహిరంగంగానే విక్రయాలు చేస్తున్నప్పటికీ తనిఖీలు నిర్వహించి నాశిరకం సరుకులను గుర్తించాల్సిన అధికారులు కనీసం అటు వైపు కూడా చూడడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఆదివారం సంత కావడంతో అధికారులకు ఆ రోజు సెలవు కావడంతో మాకెందులే ఈ ఆదివారం గోల అన్న చందంగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇదే అవకాశంగా భావిస్తున్న వ్యాపారులు వారి నాశిరకం సరుకుల వ్యాపారాన్ని దర్జాగా కొనసాగిస్తున్నారు.

తనిఖీలు నిర్వహిస్తాం



మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తాం. నాణ్యత లేని, నాశిరకం వస్తువుల విక్రయిస్తున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అమాయక ప్రజలకు నాణ్యత లేని ఆహార పదార్థాలు అంటగడుతున్న వ్యాపారుల భరతంపడతాం.

– బి.భరణిబాబు, తహసీల్దార్, చర్ల

బస్సును సద్వినియోగం చేసుకోండి



జెండా ఊపుతూ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: తెలంగాణ రాష్ట్రంలో జరిగే అతిపెద్ద జాతర మేడారానికి వెళ్లే ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం సురక్షా బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ డీఎం టి.స్వామి ఆధ్వర్యంలో మేడారం జాతర బస్సులను రిబ్బన్ కట్ చేసి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణుగూరు, మంగపేట కేంద్రాల నుంచి మణుగూరు డిపో ఆధ్వర్యంలో రద్దీని దృష్టిలో పెట్టుకుని 30 ఆర్టీసి బస్సులు అందుబాటులో ఉంచిందన్నారు. మణుగూరు నుంచి పెద్దలకు రూ. 210, పిల్లలకు రూ.110 నిర్ణయించిందన్నారు. ఆర్టీసి విభాగంపై సమీక్ష సమావేశం నిర్వహించి ప్రధాన సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మణుగూరు డిపోకు బస్సులు కొరత ఉందని కోరిన వెంటనే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి వెంటనే బస్సులను మంజూరు చేశారని గుర్తు చేశారు. లయన్స్‌క్లబ్, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు స్నాక్స్ అందించారు. జాతర జరిగే మూడు రోజుల పాటు ఆర్టీసి డ్రైవర్లకు వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం, లయన్స్‌క్లబ్ మణుగూరు ఆధ్వర్యంలో ఉచిత భోజనం ఏర్పాటుతో పాటు తొగ్గూడెంలోని మినీ మేడారంలో జరిగే జాతరకు వచ్చే భక్తులకు మణుగూరు వాసవీ క్లబ్, ఆర్యవైశ్య మణుగూరు, వాసవీ వనితా వైభవం ఉచిత అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చందా సంతోష్, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, పినపాక మండల అధ్యక్షుడు గొడిశాల రామనాథం, పట్టణ అధ్యక్షుడు శివ, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, నాయకులు కేవీరావు, పుచ్చకాయలశంకర్, వీరంకి వెంకట్రావ్, గోరంట్ల కనకయ్య, గుడిపూడి కోటేశ్వరరావు, బాణోత్ లక్ష్మణ్, జీవరత్నం, పాతూరి వెంకన్న, గాండ్ల సురేశ్, ముఖ్య నాయకులు మణుగూరు వాసవీక్లబ్ ప్రతినిధులు కేసా రాజేంద్ర ప్రసాద్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు గాజుల పూర్ణచందర్, ఆర్టీసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమాలను ఉధృతం చేయాలి

అశ్వారావుపేటరూరల్: ఉద్యమాలతోనే కార్మిక, శ్రామిక, కర్షకులకు కష్టాల నుంచి విముక్తి కలుగుతుందని, దీనికోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వేదగిరి శ్రీనివాసరావు నాల్గొవ వర్ధంతి సభను జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. నిరంతరం పేదల సంక్షేమం, వ్యవసాయ కార్మిక సంఘ నిర్మాణం కోసం వేదగిరి శ్రీనివాస్ కృషి చేశారని, ఆయన స్ఫూర్తితో కార్మిక ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూలీ బంధు ఇస్తానని చెప్పిన హామీను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అన్నవరపు కనకయ్య, కె.పుల్లయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, నిమ్మల వెంకన్న, ముదికొండ రాంబాబు, సుగుణ, చంటి రమేష్, వినోద్, గడ్డం స్వామి పాల్గొన్నారు.

ముగిసిన సుదర్శన క్రియపై శిక్షణ

భద్రాచలంటౌన్: భద్రాచలం చర్ల రోడ్డులోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో సుదర్శన క్రియపై గత వారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ ఆదివారంతో ముగిసింది. హ్యాపీనెస్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ శ్రీ రఫీ, నాంగేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ శిబిరంలో ఆరోగ్య అభిలాషులకు వివిధ రకాల యోగా ఆసనాలు, శ్వాస క్రియ వ్యాయామలతో పాటు అతి శక్తివంతమైన సుదర్శన క్రియపై శిక్షణ ఇచ్చారు. ప్రభావతి, సోంపాక సీత, మునాఫ్ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

బూర్గంపాడు: భద్రాచలంలోని నేతాజీ హాస్పటల్, సహస్ర చిల్డ్రన్స్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సారపాకలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. సారపాకలోని పద్మావతి డయాగ్నస్టిక్స్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 200 మందికి ఈసీజీ, హెచ్‌బీ రక్త పరిమాణశాతం, షుగర్ పరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. నేతాజీ హాస్పటల్‌లో లాప్రోస్కోపీ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావటం అభినందనీయమన్నారు. ఛాతీ వైద్య నిపుణుడు డాక్టర్ జగదీష్, పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి రోగులకు వైద్యసేవలను అందించారు. హాస్పటల్స్ నిర్వహకులు నర్సింహారెడ్డి, జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి, పత్తి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మణుగూరురూరల్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మణుగూరు తహసీల్దార్ మండలంలోని రామానుజవరం, అంబేద్కర్ సెంటర్‌లలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద రెవెన్యూ అధికారులు సిబ్బంది ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను, లారీలను, రవాణాకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వాహన యజమానుల వివరాలను నమోదు చేసుకుంటున్నారు.

వేడుకలో మొక్కల పంపిణీ

అశ్వారావుపేటరూరల్: ఓ శుభ కార్యానియానికి హాజరైన అతిథులకు, నిర్వాహకులు పర్యావరణ హితం కోసం వినూత్న బహుమతి అందించారు. ఆదివారం అశ్వారావుపేటలోని బీఎస్ఆర్ నగర్‌లో దండు శ్రీనివాసరాజు–సంధ్య దంపతుల ఏకైక కుమారుడి పంచెకట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా ఈ శుభ కార్యాలయానికి హాజరైన ఒక్కొక్కరికి ఒకొక్క గులాబీ మొక్కను బహుమతిగా అందించారు.

విద్యార్థులకు వీడ్కోలు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు..

బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్‌లో విజయం సాధిస్తే జీవితంలో సగం విజయం సాధించినట్లేనన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి కృషి చేద్దాం



గ్రంథాలయం సాధన కోసం సమావేశమైన నాయకులు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలో గ్రంథాలయం భవన నిర్మాణం కోసం రాజకీయాలకు అతీతంగా కృషి చేద్దామని నాయకులు అభిప్రాయపడ్డారు. మండలకేంద్రం చండ్రుగొండలోని రైతువేదికలో ఆదివారం సమావేశమైన నాయకులు, పూర్వవిద్యార్థులు, ప్రజాసంఘాల బాధ్యులు ఏకాభిప్రాయానికి వచ్చారు. గ్రంథాలయంతోపాటు మహిళల కోసం మూత్రశాలల ఏర్పాటుకు కృషి చేద్దామని నిర్ణయించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు, పెద్దిని వేణు, రాయి రాజా, వారాధి సత్యనారాయణ, సీహెచ్ వెంకటేశ్వర్లు, భోగి కృష్ణ, సంకా శంకర్, సీనియర్ జర్నలిస్టు ఎంఏ వాహెద్, విద్యావేత్త ఖాజాహుసేన్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నేడు శంకుస్థాపన

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయితీలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ గ్రాంట్ క్రింద మంజూరైన రూ.22.50 లక్షలతో చేపట్టనున్న బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు మండల ప్రజాపరిషత్ అసిస్టెంట్ ఇంజనీర్ రామారావు ఆదివారం తెలిపారు. సమితిసింగారం గ్రామంలో బీటీ రోడ్డు నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా డిగ్రీ కళాశాల వరకు సీసీ రోడ్డును నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

చండ్రుగొండలో రేపు సేవాలాల్ జయంతి

చండ్రుగొండ: ఈ నెల 20న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు నియోజకవర్గస్థాయిలో చండ్రుగొండలో నిర్వహించనున్నట్లు సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ బాధ్యులు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్న లంబాడాలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. సమావేశంలో నాయకులు భోజ్యానాయక్, ఇస్లావత్ వీరన్ననాయక్, సేవ్యా, రంగా, దారావత్ రమారావు మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన నాయకులు



దుమ్ముగూడెం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన నాయకులు

దుమ్ముగూడెం: భద్రాచలం ఐటీడీఏలో జరిగిన పాలకమండలి సమావేశానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్రమంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరావులను మండల అధ్యక్షుడు లంకా అబ్బులు ఆధ్వర్యంలో కలిసి మండల సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఎస్.లక్ష్మీపురం గ్రామంలో వరదలకు కొట్టుకుపోయిన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, లక్ష్మీనగరం నుంచి అచ్చితాపురం వరకు రహదారి నిర్మాణం,ప్రగళ్లపల్లి లిఫ్ట్ నిర్మాణం, త్రీఫేజ్ విద్యుత్ సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. మంత్రులు సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని లంకా అబ్బులు తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో కోడి చంటి, తెల్లం హరికృష్ణ, దర్శి సాంబశివరావు, పిలక వెంకట రమణారెడ్డి, నరేష్ తదితరులు ఉన్నారు.

చర్ల: చర్ల మండలంలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న పలు సమస్యలను ఆదివారం టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్, జెడ్పీటీసీ ఇర్పా శాంత, పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు బట్టీవిక్రమార్కకు వివరించారు. భద్రాచలంలో జరిగిన ఐటీడీఏ పాలక మండలి సమావేశానికి హాజరైన డిప్యూటీ సీఎం బట్టీ విక్రమార్కను కలిసిన నేతలు చర్ల మండలంలో అగ్ని మాపక కేంద్రం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యుల నియామకం, పోడు భూములకు పట్టాలు, అసంపూర్తిగా ఉన్న రహదార్ల నిర్మాణాలకు మరమ్మతులు, కొత్త రహదార్ల నిర్మాణాల గురించి బట్టీకి వివరించగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

ఎంపీపీ ఆధ్వర్యంలో..

అశ్వాపురం: భద్రాచలంలో ఐటీడీఏ పాలకమండలి సమావేశంకు ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఎంపీపీ ముత్తినేని సుజాత భద్రాచలంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో పలు సమస్యలు, అభివృద్ధికి సంబంధించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు ఎంపీపీ సుజాత తెలిపారు.

ఆరోగ్యానికి 'ఆయుష్'తో ఊతం!

- సంప్రదాయ వైద్యంపై ఆసక్తి పెరిగేలా కార్యక్రమాలు
- ముమ్మరంగా వైద్య శిబిరాల ఏర్పాటు
- చూర్ణాల స్థానంలో ప్యాకింగ్ మందులు



చూర్ణాలను టాబ్లెట్ల రూపంలో ప్యాకింగ్ చేసిన దృశ్యం



శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

కరకగూడెం: వాతావరణ మార్పులు, క్రమం తప్పుతున్న ఆహారపు అలవాట్లు,వీటికితోడు మానసిక, ఉద్యోగ ఒత్తిడులు.. వెరసి ప్రస్తుతం మనిషిని తొందరగా అనారోగ్యం పాలుచేస్తున్నాయి.ఇలాంటి పరిస్థితుల నుంచి మనిషి బయటపడాలని ఆయుష్ వైద్య విధానాలను అనుసరించి ఆహారపు అలవాట్లు, జీవన విధానాల్లో మార్పుతేవాలని గ్రామాలని ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో నేషనల్ ఆయుష్ మిషన్, గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కలిసి పలు కార్యక్రమాలకు కొన్ని నెలల క్రితం శ్రీకారం చుట్టగా.. అవి మండలంలో సత్ఫలితాలు ఇస్తున్నాయి. గతంలో కంటే ఆస్పత్రిలో ఓపీ పెరగడంతో సంప్రదాయం వైద్యం పట్ల ప్రజలు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో తరచూ వైద్య శిబిరాలు నిర్వహిస్తూ గ్రామస్తులకు ఆరోగ్యం పట్ల చైతన్య పరచడంతో పాటు విద్యాలయాల్లో విద్యార్థులకు ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడే అంశాలను వివరిస్తున్నారు.

అవగాహన, మందుల పంపిణీ

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆయుష్ కరదీపిక పేరిట 36 పేజీలతో పుస్తకాలను ముద్రించారు.ఆరోగ్య పరిరక్షణకు దోహదం చేసే అంశాలు అందులో పొందుపర్చారు.భారతీయ పురాతన ఆయుర్వేద వైద్యం ప్రాముఖ్యత, కలిగే లాభాలను రోగులకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. యోగాతో పాటు ప్రకృతి వైద్యంలో పాటించాల్సిన మెలకువలను సూచించడంతో పాటు కాలానికి అనుగుణంగా వచ్చే వ్యాధులకు చికిత్స అందించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అదేవిధంగా మండల కేంద్రాలతో పాటు ఆయుష్ వైద్య సేవలపై అధికారులు ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లో విరివిరిగా శిబిరాలు నిర్వహించినప్పుడల్లా చాలామంది తమకు అవసరమైన ఔషధాలు తీసుకెళ్తున్నారని,దీర్ఘకాలిక వ్యాధిగ్రాస్థులు ఎక్కువగా ఆయుష్ వైద్యంపై మక్కువ చూపుతున్నట్లు ఆయుష్ అధికారులు చెబుతున్నారు.

మందుల ప్యాకింగ్..

ఆయుష్ వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు గత రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆయుర్వేద, యునాని ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్నపౌడర్ స్థానంలో మాత్రలు పంపిణీ చేస్తోంది. గతంలో మందులను చాలావరకు పౌడర్ రూపంలో ఇచ్చేవారు.దీన్ని పొట్లంగా కట్టి ఆస్పత్రులకు సరఫరా చేసే సమయంలో పలుమార్లు ప్యాకింగ్ చినిగిపోవడంతో పాటు ఎలుకలు కొరికితే పాడయ్యేవి. అలాగే పౌడర్ రూపంలో ఇచ్చే మందులపై రోగులు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. ఆలోపతి(ఇంగ్లీష్)మందుల ప్యాకింగ్ తరహాలో తయారుచేసిన మాత్రల పంపిణీ వల్ల మళ్లీ వీటికి ఆదరణ పెరుగుతోంది. రోగులు కూడా ఇవి వాడడాన్నిఆసక్తి చూపుతున్నారు.ఇటీవల ఆయుర్వేద ఆస్పత్రులకు రోగుల సంఖ్య అధికమవుతోంది. మాత్రలు, ఇతర నూనె పదార్థాలను డబ్బాల్లో ప్యాకింగ్ చేసి ఉప కేంద్రాల్లోనూ రోగులకు అందజేస్తున్నారు.తద్వారా రోజు రోజుకు ఆయుష్ వైద్య సేవలపై జనాల్లో మంచి స్పందన వస్తోంది.

మంచి ఫలితాలిస్తున్నాయి..



ఆయుర్వేద మందులు నేను గత రెండేళ్లుగా వాడుతున్న. మంచి ఫలితాలు ఇస్తున్నాయి.గతంలో మందులు చూర్ణాల రూపంలో ఇవ్వడంతో వేసుకోవడానికి పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. ఇప్పుడు వాటిని ప్యాకింగ్ చేసి టాబ్లెట్స్ రూపంలో ఇస్తుడడంతో నాతో పాటు చాలా మంది మందులు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

– సంపటి మధు, కరకగూడెం

అవగాహన కల్పిస్తున్నారు..



మా గ్రామంలో తరచూ వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఆయుష్ వైద్యం పట్ల అవగాహన కల్పిస్తున్నారు.ఎటువంటి దీర్ఘ కాలిక సమస్యలు ఉన్నా నయమవ్వడానికి మందులు ఇస్తున్నారు.మండల కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాలలో మహిళా సిబ్బందిని నియమించాలి. మహిళలు వారి ఆరోగ్య సమస్యలు చెప్పుకోవడనికి వీలుగా ఉంటుంది.

– ఈసం శాంత, కొత్తగూడెం

ఆయుష్‌కు మంచి రోజులు



ఏళ్ల నాటి ఆయుష్ వైద్యానికి తిరిగి మంచి రోజులు వస్తున్నాయి. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న అనేక మందికి ఆయుష్ వైద్యంతో నయం అవుతోంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే నా ముందున్న లక్ష్యం. అందుకు క్షేత్ర స్థాయిలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం.

– సీహెచ్ కుమారస్వామి, ఆయుర్వేద వైద్యాధికారి, కరకగూడెం